4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
బుధవారం 27 నవంబర్ 2024
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

## అదానీ దుమారం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అత్యంత సన్నిహితుడైన గౌతమ్ అదానీకి అగ్రరాజ్యమైన అమెరికా అరెస్టు వారంట్ జారీచేయడంతో ఇండియాలో రాజకీయ దుమారం చెలరేగింది. భారతదేశంలో విద్యుత్తు ప్రాజెక్టుల కోసం రాజకీయ పెద్దలకు ముడుపులు ఇచ్చారనీ, పెట్టుబడుల సేకరణ సందర్భంగా నిజాలు దాచిపెట్టారనేవి అదానీపై ప్రధానమైన ఆరోపణలు. ఇవి అమెరికా చట్టాల ప్రకారం నేరాలనీ, వీటి ఉల్లంఘన ఎక్కడ జరిగినా తమ న్యాయవ్యవస్థ వదిలిపెట్టదనీ అమెరికా అంటున్నది. భారత కుబేరుడిని ప్రపంచ పెద్దన్న అమెరికా జైలుకు పంపేందుకు సిద్ధమైందన్న వార్త మన దేశంలో సహజంగానే ప్రకంపనలు సృష్టించింది. స్టాక్‌మార్కెట్ కుప్పకూలింది. ముఖ్యంగా అదానీ గ్రూప్ షేర్లు దారుణంగా దెబ్బతిన్నాయి. ఒక్కరోజులోనే కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. అదానీ విషయమై పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీలు హంగామా చేస్తున్నాయి. ఇది టీ కప్పులో తుఫానులా సమసిపోతుందా? లేక పైకప్పులు ఎగరగొట్టే వాయుగుండమవుతుందా? అనేది ఇదమిద్ధంగా చెప్పలేం. మోదీ ప్రాపకంలోనే వివాదాస్పద పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ అంచెలంచెలుగా ఎదిగి ప్రపంచ కుబేరుడయ్యారన్న సంగతి మరువరాదు. ఏది ఎలా ఉన్నప్పటికీ అదానీ గ్రూప్ సంస్థలకు హిండెన్‌బర్గ్ ఉదంతాన్ని మించిన నష్టాన్ని అమెరికా అరెస్టు వారంటు కలిగించిందని చెప్పక తప్పదు.

అదానీ ప్రతిధ్వనులు మన రాష్ట్రంలోనూ వినిపించాయి. అదానీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఢిల్లీలో నిప్పులు చెరుగుతుంటే, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదే అదానీకి ఎర్రతివాచీ పరచి స్వాగతిస్తుండటం విస్మయం కలిగించింది. ఇప్పుడు అమెరికా వారంటు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అదానీతో జరిపిన సయ్యాటలపైకి అందరి దృష్టి మరోమారు మళ్లింది. వివాదాస్పద పారిశ్రామికవేత్త రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేందుకు ఇదివరకూ ప్రయత్నాలు జరుపకపోలేదు. రాష్ట్రంలో 20 వేల మెగావాట్ల థర్మల్ ప్లాంట్ కోసం అదానీ గ్రూప్ వస్తే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సున్నితంగా తిరస్కరించడం తెలిసిందే. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. అధిష్ఠానం వైఖరికి భిన్నంగా అదానీపై ప్రత్యేకాభిమానం ప్రదర్శించడం విడ్డూరం.

ప్రస్తుత వివాదాలు ముసురుకున్న వేళ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆత్మసమర్థనలో పడింది. అందులో భాగంగానే అదానీ ఇచ్చిన విరాళంపై యూటర్న్ తీసుకున్నది. స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఇచ్చిన రూ.100 కోట్ల విరాళం తిరస్కరిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హడావుడిగా ప్రకటించారు. అదానీతో సహా ఏ సంస్థ నుంచీ తెలంగాణ సర్కారు విరాళాలు తీసుకోలేదని మీడియా సాక్షిగా వివరణ ఇచ్చుకున్నారు. అధిష్ఠానం అల్టిమేటంతోనే ఆయన అందుకు సిద్ధమయ్యారనేది తెలుస్తూనే ఉంది. అంతటి ఇరకాటంలోనూ విపక్ష పార్టీపై బట్టకాల్చి మీద వేసే ప్రయత్నాలు ఆపలేదు. కేంద్ర ప్రాజెక్టులను బీఆర్ఎస్ ఖాతాలో వేసేందుకు విఫలయత్నం చేసి అభాసుపాలయ్యారు. దావోస్‌లో అదానీ గ్రూప్‌తో అట్టహాసంగా కుదుర్చుకున్న వేల కోట్ల రూపాయల ఒప్పందాలను రద్దు చేసుకుంటారా? దీనిపై రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ వివరణ ఇచ్చుకోవాల్సి ఉన్నది.

# చెప్పిన అబద్ధం చెప్పకుండా.. ఏడాది!

**చెప్పిన అబద్ధం చెప్పకుండా కొత్త అబద్ధాలతో ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేయడం, అది విఫలమైతే మాట మార్చడం కాంగ్రెస్ నేతలకు, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పరిపాటిగా మారింది. కర్ణాటక, తెలంగాణలో గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ నాయకులు మోసం చేశారు. మరోసారి మహారాష్ట్రలోనూ గ్యారెంటీల పేరుతో మోసం చేయబోయి బొక్కబోర్లా పడ్డారు. అక్కడ మహిళ లకు ప్రతి నెల రూ.3 వేలు ఇస్తామని, రైతులకు రుణమాఫీ చేస్తామని హామీలు గుప్పించగా.. తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ నిర్వాకం తెలుసుకొన్న మహారాష్ట్ర ప్రజలు వారిని గట్టిగా తిరస్కరించారు.**






**తన్నీరు హరీశ్‌రావు**

తెలంగాణ సీఎంతో సహా పలువురు రాష్ట్ర మంత్రులు అక్కడికి వెళ్లి ప్రచారం చేస్తే ప్రజలు వారికి తగిన బుద్ధి చెప్పారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా రేవంత్‌రెడ్డి 13 అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రచారం చేస్తే వాటిలో ఒక్క సీటులోనే కాంగ్రెస్ గెలిచింది. ఆయన మూడు సార్లు మహారాష్ట్ర వెళ్లి వారం రోజుల పాటు మకాం వేసినా ఫలితం లేకపోయింది. అక్కడ ఎదురైన పరాభవం తర్వాతనైనా తెలంగాణ కాంగ్రెస్ నేతలకు జ్ఞానోదయం కలిగినట్టు లేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అమలుచేస్తామని జనాన్ని నమ్మించే ప్రయత్నం చేసినా వారు నమ్మలేదు.

**మహారాష్ట్ర ఫలితం అలా ఉంటే, ఇక్కడ తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా, ఇచ్చిన హామీలను అమలుచేయకుండా విస్మరించారు. మాట తప్పి కూడా, తాము పాలించిన ఏడాదిలో ఏదో ఘనకార్యం చేసినట్టు ఇప్పుడు వాడవాడలా సంబురాలు చేసుకొనేందుకు సమాయత్తం అవుతోంది తెలంగాణ కాంగ్రెస్. తాను ముఖ్యమంత్రి కాగానే మొదటి సంతకం 6 గ్యారెంటీలపైనే పెట్టి, వాటికి చట్టబద్ధత కల్పిస్తామని, బాండ్ పేపర్‌తో ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేయండని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించలేదు.**

ఎన్నికల సమయంలో 420 హామీలిచ్చారు. 11 నెలల పాలనలో ప్రజలకు ఏం చేశారో, ఏం సాధించారో ఒక స్పష్టత ఇవ్వకుండా సంబురాలు జరుపుకోవడంపై అనేక సందేహాలొస్తున్నాయి. ఆరు గ్యారెంటీలపై మోసం చేయడంతో పాటు పెంచుతామన్న పింఛన్లు, ఇస్తామన్న నిరుద్యోగ భృతి, విద్య భరోసా కార్డు, ఉద్యోగాలు ఏవీ రాలేదు. ఇప్పటివరకు ఒక విద్యార్థికి కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ డబ్బులివ్వలేదు. దీంతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాయి.

రైతులకు రూ.2 లక్షల వరకు వర్తించేలా, రూ.31 వేల కోట్ల మేర రుణాలను మాఫీ చేస్తామని చెప్పి కేవలం రూ.17 వేల కోట్లతో సరిపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను దగా చేసింది. చేసిన అప్పులు తిరిగి కట్టలేక రాష్ట్రంలో 50 శాతం మంది రైతులు ఇప్పటికీ ఇబ్బంది పడుతున్నారు. కొంతమంది ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఏర్పడింది. భూమి సాగుచేసే ప్రతి రైతుకు, రైతు భరోసా కింద ప్రతి ఎకరాకు రూ.15 వేలు ఇస్తామన్న హామీ నెరవేర్చకపోవడంతో తెలంగాణ రైతులు కాంగ్రెస్ చేతిలో దగా పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారడంతో వారు రేవంత్ సర్కార్‌పై భరోసా కోల్పోయారు. పత్తికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పటికీ ఇవ్వకుండా దాన్ని బోగస్ హామీగా మార్చారు. పత్తి కొనుగోలుపై ఇప్పటివరకూ ముఖ్యమంత్రి సమీక్ష చేయలేదు. పత్తితో పాటు మిర్చి రైతులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. కాంగ్రెస్ పాలనలో రైతులు నష్టపోయి, దళారులు లాభపడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏడాది వ్యవధిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, నిరుద్యోగులకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని రాహుల్ గాంధీ ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చాక యువతను మోసం చేశారు. అశోక్‌నగర్ సెంటర్‌లో ఉద్యోగాల కోసం యువత ఉద్యమిస్తే పోలీసులు లాఠీలు ఝుళిపించి, తలలు పగులగొట్టారు. అమ్మాయిలు అని కూడా చూడకుండా ఈడ్చుకెళ్లి జైలు పాల్జేశారు.

**రాష్ట్రంలో వృద్ధులకు రూ.4 వేల చొప్పున పింఛన్ ఇస్తామని చెప్పి మాట తప్పారు. రూపాయి కూడా పెంచలేదు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు రూ.2,500 చొప్పున ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారు. యువత, రైతులు, మహిళలు ఇలా విభిన్నవర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. కాంగ్రెస్ మోసాన్ని ఎక్కడికక్కడ జనం నిలదీస్తూ, ఇచ్చిన హామీలను అమలుపరచమని అడుగుతుంటే అసహనంతో వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు.**

గ్రేటర్ హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణ పేరుతో 'హైడ్రా' తీసుకొచ్చి నగరంలో ఇండ్లను నేలమట్టం చేస్తున్నారు. మూసీ సుందరీకరణ పేరుతో పేద ప్రజలు, దళితులు కట్టుకున్న ఇండ్లను కూల్చివేస్తున్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు వ్యయం అంచనాను లక్షా 50 వేల కోట్ల రూపాయలకు పెంచి, ఆస్థాన గుత్తేదారుల జేబులు నింపే ప్రయత్నం చేస్తున్నారు. ప్రాజెక్టుకు రూపురేఖలే లేవు. సమగ్ర ప్రాజెక్టు లేదు. పర్యావరణ ప్రభావం అంచనా లేదు. ఏదీ లేకుండానే... నిరుపేదల ఇండ్లు కూల్చే కార్యక్రమాన్ని మాత్రం ఠంచన్‌గా చేపట్టారు. కాంగ్రెస్ అంటేనే పేదల వ్యతిరేక ప్రభుత్వమని మరోమారు రుజువు చేశారు. దళిత బంధు పథకాన్ని హుజూరాబాద్‌లో కేసీఆర్ ప్రారంభించి 18,500 దళిత కుటుంబాలకు సహాయ సహకారాలు అందజేశారు. ఈ పథకం కింద రెండో విడత డబ్బుల విడుదలపై ప్రశ్నించిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మీద అరాచకానికి పాల్పడ్డారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పథకాలను ప్రవేశపెట్టడం మాట దేవుడెరుగు, ఇప్పటికే ఉన్న పథకాలను సైతం అమలు చేయలేకపోతున్నది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని లగచర్లలో జరిగిన ప్రభుత్వ దౌర్జన్యకాండను ప్రజలు గమనిస్తున్నారు. ఫార్మా విలేజీ కోసం బలవంతంగా భూ సేకరణకు పాల్పడటంపై రైతులు తిరగబడితే దౌర్జన్యంతో పోలీసులు వారిని భయభ్రాంతులకు గురిచేసి, భూములు గుంజుకొనే ప్రయత్నం చేశారు. అయితే, రైతులు ఎదురు తిరగటం, ఈ అంశం జాతీయస్థాయిలో అలజడి సృష్టించడంతో రేవంత్‌రెడ్డి మాట మార్చారు. కొడంగల్‌లో ఏర్పాటుచేసేది ఫార్మాసిటీ కాదు, ఇండస్ట్రియల్ కారిడార్ అంటూ ఇప్పుడు అబద్ధాలు చెప్తున్నారు. జూలై 19వ తేదీన ఇచ్చిన గెజిట్‌లో ఫార్మాసిటీ అని స్పష్టంగా పేర్కొన్నారు. ఆ గెజిట్‌ను వాపస్ తీసుకోకుండా ఇలాంటి అబద్ధాలతో ఎంతకాలం పబ్బం గడుపుతారు? తనను ఎన్నుకున్న ప్రజల వద్దకు వెళ్లి, వారికి నచ్చజెప్పే ధైర్యం ఈ ముఖ్యమంత్రికి లేదా? సామరస్యంగా సమస్యను పరిష్కరించే సహనం లేదా? పచ్చటి పంట పొలాలను తొండలు గుడ్లు పెట్టని జాగలు అంటూ.. అబద్ధాలతో ఎవరి నోరు మూయించాలనుకుంటున్నారు?

కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం వృథా చేశారని, ఆ మొత్తాన్ని బీఆర్ఎస్ నాయకులు స్వాహా చేశారని ప్రచారం చేస్తున్నారు. ఆ ప్రాజెక్టు కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని, దానిలో ఒక ఎకరాకు కూడా కొత్తగా సాగునీరు ఇవ్వలేదంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. మరోవైపు కాళేశ్వరం నీళ్లతో మూసీ పునరుజ్జీవం చేస్తామని, ఇవే నీళ్లను హైదరాబాద్ తాగునీటి వసతి కోసం వినియోగిస్తామని చెప్తున్నారు. కూలిపోయే ప్రాజెక్టు నుంచి నీళ్లిస్తారా? అదెలా సాధ్యం ప్రజలు ఏ మాటలు నమ్మాలో రేవంత్‌రెడ్డే చెప్పాలి. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయే దశలో ఉందని చెప్తున్న కాంగ్రెస్ నేతలు కొండపోచమ్మ, మల్లన్నసాగర్‌ల నుంచి హైదరాబాద్ నగరానికి 20 టీఎంసీల నీటిని మిషన్ భగీరథ ద్వారా ఇవ్వాలని ఎలా ప్రణాళికలు చేస్తున్నారో అర్థం కావడం లేదు. పరస్పర విరుద్ధమైన మాటలతో పచ్చి అబద్ధాలు చెప్తూ పబ్బం గడుపాలని ఈ ప్రభుత్వం చేస్తున్న యత్నాలకు అంతేలేకుండా పోతున్నది. కుప్పకూలిందని చెప్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లను ఇదే కాంగ్రెస్ సర్కార్ మల్లన్నసాగర్ నుంచి, రంగనాయక్‌సాగర్ నుంచి పంట పొలాలకు విడుదల చేయడం గమనార్హం.

తెలంగాణలో 1.61 కోట్ల మెట్రిక్ టన్నుల పంట పండితే అది తమ గొప్పతనం అని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారు. 2014లో తెలంగాణ ఏర్పడేనాటికి రాష్ట్రంలో 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిస్తే, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో దాన్ని 141 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచి రాష్ట్రాన్ని ధాన్యాగారంగా మార్చింది. 50 ఏండ్లు కాంగ్రెస్ పార్టీ, 16 ఏండ్లు తెలుగుదేశం పార్టీ పాలనలో ఎందుకని కేవలం 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే తెలంగాణలో పండిందో చెప్పగలరా? తెలంగాణ నుంచి రికార్డు స్థాయిలో కోటి 60 లక్షల టన్నుల ధాన్యం వస్తే.. ఇది కాళేశ్వరం గొప్పతనం కాదని, 11 నెలల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ గొప్పతనమని చెప్పుకోవడానికి వారికి కనీసం సిగ్గయినా ఉండాలి.

**తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్ల పాలనాకాలంలో తెలంగాణ ఆకాశమంత ఎత్తుకు ఎదిగితే, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఏడాది పాలనాకాలంలో రాష్ట్రం అధఃపాతాళంలో కూరుకుపోయింది. ఇందుకు ఎన్నో కారణాలున్నా, మచ్చుకు కొన్ని మాత్రమే ఇక్కడ చర్చించాను.**

కాంగ్రెస్ సర్కార్ తెలంగాణలో అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తున్నా, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, పచ్చి అబద్ధాలు-మోసపూరిత మాటలతో కాలయాపన చేస్తున్నది. రేవంత్ పాలనలో ప్రజలు ముఖ్యంగా బాధితులు తమకెదురైన అన్యాయాన్ని గట్టిగా నిలదీస్తే వారిపై దౌర్జన్యాలు చేస్తూ, కేసులు బనాయిస్తున్నారు. పూటకో మాట, రోజుకో మాట మారుస్తూ ఎంత కాలం ప్రజలను నమ్మించి మోసం చేస్తారు? ఉద్యమాలకు నెలవైన తెలంగాణలో ప్రజల సహనానికి ఒక హద్దు ఉంటుంది. ప్రజల సహనాన్ని పరీక్షిస్తే వారి తరఫున ప్రభుత్వాన్ని నిలదీసేందుకు బీఆర్ఎస్ సదా సిద్ధంగా ఉన్నది. ముందుముందు మరిన్ని ప్రజా ఉద్యమాలను చేపట్టడం ఖాయం.

**(వ్యాసకర్త: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే)**

# మెరుగైన ప్రజారవాణా ప్రాథమిక హక్కు

**భారత్ వంటి ఎక్కువ జనసాంద్రత కలిగిన దేశాల్లో మెరుగైన ప్రజారవాణా వ్యవస్థలు అవసరం మాత్రమే కాదు, అవి జీవనాధారం కూడా. వేగవంతమైన పట్టణీకరణ, పరిమిత స్థలం, విపరీతమైన ట్రాఫిక్‌జామ్, పెరుగుతున్న కాలుష్యం తదితర అంశాలు ప్రయాణ సమయాన్ని మరింతగా పెంచుతున్నాయి. ప్రైవేట్ వాహనాలపై అతిగా ఆధారపడటం, ట్రాఫిక్‌జామ్, వాయు కాలుష్యం తదితర సమస్యలకు ప్రజా రవాణా, ముఖ్యంగా మెట్రో రైలు నెట్‌వర్క్‌లు స్థిరమైన పరిష్కారాన్ని చూపుతాయి.**



**ఎం.సంపత్‌రెడ్డి**
94400 90059



హైదరాబాద్ ఒక మెట్రోపాలిటన్ నగరం. ఆర్థికపరంగా తెలంగాణకు వెన్నెముక. సుమారు 70- 80 శాతం రాష్ట్ర ఆదాయం ఈ నగరం నుంచే సమకూరుతున్నది. నగరాభివృద్ధి, వేగవంతంగా జనాభా పెరుగుదల నేపథ్యంలో పటిష్ఠమైన ప్రజా రవాణా అవసరం. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై తదితర నగరాల్లో మెట్రో రైల్ ఒక గేమ్ ఛేంజర్‌గా నిరూపితమైంది. ప్రతిరోజు మిలియన్ల మంది ప్రయాణికులు సురక్షితంగా, వేగంగా తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. అంతేకాదు, మెట్రో ప్రయాణం పర్యావరణ హితమైనది కావడం గమనార్హం.

హైదరాబాద్ మెట్రో నెట్‌వర్క్ అనతికాలంలోనే విజయవంతమైంది. 70 కిలోమీటర్లకు పైగా ఉన్న మెట్రోకు ప్రజల నుంచి విశేష స్పందన ఉన్నది. అయితే, పెరుగుతున్న జనాభా, నగర విస్తరణకు తగ్గట్టుగా మెట్రో నెట్‌వర్క్‌ను కూడా విస్తరించాల్సిన అవసరం ఉన్నది. విస్తరణ సమయంలో కొన్ని కీలక విషయాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. విస్తరణలో అధిక జనాభా, అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలకు మొదట ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ కోణంలో చూసుకుంటే ఉత్తర హైదరాబాద్ ప్రాంతంలోని ప్రతిపాదిత కారిడార్ 1: ప్యారడైజ్- డైరీఫామ్ రోడ్- కొంపల్లి- మేడ్చల్ (22 కి.మీ.), కారిడార్ 2: జేబీఎస్-శామీర్‌పేట- తూంకుంట (19 కి.మీ.), కారిడార్ 3: తార్నాక-ఈసీఐఎల్- నాగారం- కీసర (20 కి.మీ.), కారిడార్ 4: బోయిన్‌పల్లి-మూసాపేట్-సూరారం- గండిమైసమ్మ (21 కి.మీ.) నగరాభివృద్ధిలో ఎంతో కీలకం.

**ఈ ప్రాంతాల్లో సుమారు 30 లక్షల మందికి పైగా నివసిస్తున్నారు. వీరిలో అత్యధికులు ఐటీ నిపుణులే. వారు హైటెక్ సిటీ, ఇతర ఉపాధి కేంద్రాలకు నెలవైన ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మెట్రో విస్తరణలో అటువంటి జనసాంద్రత ఉన్న ప్రాంతాలను విస్మరించడం సరికాదు. ముగ్గు కూడా పోయని ఫ్యూచర్ సిటీకి మెట్రో విస్తరణలో ప్రాధాన్యం ఇవ్వడం ఆందోళనకరం.**

మెట్రో రైలు అనవసర ఖర్చు కాదు, అది పెట్టుబడి. మెట్రో రైలు ప్రాజెక్టుల వల్ల ప్రజాధనం వృథా అవుతుందని కొందరు వాదిస్తున్నారు. అయితే, అలాంటివారు మెట్రోపై పెట్టే పెట్టుబడుల వల్ల కలిగే దీర్ఘకాలిక ప్రయోజనాలను గుర్తించడం లేదు. మెట్రో నెట్‌వర్క్ వల్ల నగరం గణనీయంగా వృద్ధి చెందుతుంది. దాంతో పాటు వ్యాపారాలు, ఉత్పాదకత పెరుగుతాయి. ఉపాధి అవకాశాలు లభిస్తాయి. పౌరుల జీవన నాణ్యత మెరుగుపడుతుంది. అందులోనూ హైదరాబాద్ వంటి అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో స్థిరమైన వృద్ధికి మెట్రో ఎంతగానో దోహదపడుతుంది.

మెట్రో అంటే లగ్జరీ కానే కాదు, అది ఒక అవసరం. అంతేకాదు, మెరుగైన ప్రజా రవాణా పౌరుల ప్రాథమిక హక్కు. ప్రత్యేకించి రాష్ట్ర ఆదాయంలో సింహభాగం అందించే హైదరాబాద్ నగరం నలుమూలలను మెట్రో నెట్‌వర్క్‌తో అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలి. తద్వారా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు సమకూరి అంతర్జాతీయ నగరంగా హైదరాబాద్ సమగ్ర, సమతుల వృద్ధి చెందుతుంది.

**(వ్యాసకర్త: వ్యవస్థాపక సభ్యులు, మేడ్చల్ మెట్రో సాధన సమితి)**





# నిలిచి గెలిచిన ఉద్యమ దీప్తి

అమ్మ కడుపులో బిడ్డను తిరుగనీయలె
అసెంబ్లీలో జై తెలంగాణ అననీయలె
చినుకును కురువనీయలె
కోలాటం పాటనెత్తనీయలె
కుట్రల కేసులు.. పోలీసు కంచెలు
నిర్బంధాల పహరాలు

ఉద్యమం
ఉవ్వెత్తున ఎగిసేకొద్దీ విద్రోహపు చర్యలు
ఆశయం ప్రజ్వరిల్లకుండా అనేక విద్రోహాలు
చావో రేవో సత్యాగ్రహానికి చాటింపు
అవని అంబరాన చీకటి మబ్బులు
తెలంగాణ స్వతంత్రతకై
చీకట్లను చీల్చుకొని వెలుగునివ్వాలనే ఆకాంక్ష

మలుపు మలుపులో ఉద్యమ ద్రోహాలు
కమిటీలు, కమిషన్లు, ఒప్పందాలు పెట్టుబడుల
మోసాలు
నెత్తిన బరువు దించనీయరు
భుజాన కావడినెత్తుకోనీయరు
ఒడ్డును తెంచినట్టు పాలెగాళ్ల పొరలు
దండుపాళెం దండులు

తాను
ఎండిన కొమ్మకు చిగురై
రావి తరువై నిలబడ్డాడు
వట్టిపోయిన బీళ్లు పూడిన చెరువుల కన్నీరు
కరువు కోరల్లో ఆత్మహత్యలు, కరెంటు చావులు,
ఆకలి చావులు భూమంతా దుక్కం దుక్కం
పదవులు గడ్డిపోసలని, తనువంతా అమరుల శ్వాసై
మిస్సైళ్లలా దూసుకుపోయే మాటల ధాటి
విద్రోహపు గుండెల్లో అలజడి

అరవై ఏండ్ల ఉద్యమ చరిత్రను
మలుపు తిప్పిన ఉక్కు సంకల్పం
నాలుగు కోట్ల పిడికిళ్లు
నిప్పుల గుండాలై శివమెత్తిన అస్తిత్వం
ధాన్యపు గుమ్మిగా, పూలరాసిలా జన సముద్రం
గమ్యాన్ని ముద్దాడే సాహస పౌరుషం
వంచకులను ఢీకొట్టి, కాలానికి ఎదురీది, అగ్నిపరీక్షల్లో
నిలిచి గెలిచిన ఉద్యమ దీప్తి

సిద్దిపేట కార్యక్షేత్రం
అల్గునూరు చౌరస్తా మాటుగాసిన దుండగులు
భగ్గుమన్న యూనివర్సిటీలు
బందీలతో బందూకుల జల్లెడలు
దిక్కులన్నీ దిగ్బంధం
శ్రీకాంతాచారి ఆత్మాహుతి
తెలంగాణ వస్తే జైత్రయాత్ర,
లేకుంటే నా శవయాత్రని ప్రతినబూని
నడుస్తూ నిలదీస్తూ ఉరుకుతూ ఉద్యమిస్తూ
పిడికిలెత్తుతూ విప్లవిస్తూ
ప్రతికూలతలను అధిగమిస్తూ ప్రతిఘటనలనెదిరిస్తూ
ప్రజల ఆకాంక్షకై విడివిడి దారులొక్కటైన చేతనం
అందరినీ కలుపుకొనే సత్యాగ్రహ సమరం


ఉద్యమ అంబరాన పొగలు సెగలు
కదలిన కాంగ్రెస్ చిదంబరాలు
తెలంగాణ ప్రక్రియ ప్రారంభమవుతున్నదనే
పావురం లాంటి వార్త తెల్లారకముందే
అర్ధరాత్రి అపచారమని అడ్డుపడిన
మొండిచేతుల తొండాట
నమ్మించారు నిమ్మకు నీరెత్తించారు
తూకాలకు జరిగిపోయారు, కలలను అమ్ముకున్నరు
అయినా తెలంగాణ నిప్పుల క్రాంతి

పాటా మాటా, ఆటా బాటా తెలంగాణ
కలం పొలం హలం రణం తెలంగాణ
దిక్కులు దిశలు తెలంగాణ
గుండె బావుటాన్నెగురేసి
తెలంగాణ ప్రకటనను సాధించిన దీక్షా దివస్



**వనపట్ల సుబ్బయ్య**
94927 65358

**(నవంబర్ 29న కేసీఆర్ దీక్షా దివస్)**




## పార్టీలను చీల్చడంలో దిట్ట!



**అజిత్‌పవార్, ఏక్‌నాథ్ షిండే సొంత నిర్ణయాలు తీసుకోలేరు. ఎందుకంటే వారి పార్టీలు బీజేపీకి అనుబంధ కంపెనీలు. బీజేపీకే ఎక్కువ సీట్లు వచ్చినందున మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలున్నాయి. ఒకవేళ పూర్తి మెజారిటీ లేకపోయినా బీజేపీకి వచ్చిన ఇబ్బందేం లేదు. ఎందుకంటే, పార్టీలను చీల్చి మెజారిటీని ఎలా పెంచుకోవాలో కమలనాథులకు బాగా తెలుసు. అందులో వారు నిష్ణాతులు.**

**- సంజయ్ రౌత్**
శివసేన (యూబీటీ) రాజ్యసభ సభ్యుడు